గొప్ప సంఘ సంస్కర్త వాలంటిన్ హాయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



సమావేశానికి హాజరైన సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: అంధులలో అక్షర జ్యోతిని వెలిగించిన గొప్ప సంఘ సంస్కర్త వాలంటిన్ హాయ్ అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ లూయిస్ బ్రెయిలీ భవనంలో బుధవారం వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలెంటిన్ హాయ్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు పెద్ద వెంకటస్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఇస్మాయిల్, జావిద్, మధు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘ అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య యాదవ్, దేవి, శేఖర్, ఆంజనేయులు, సత్యం, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: ఆటో డ్రైవర్లు వాహనాలను నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు దుండిగల్, సూరారం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో బుధవారం ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని సూచించారు. విద్యార్థినులు, మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదిలికలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సరైన పత్రాలు లేని ఆటోలను పోలీస్ స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సతీష్, ఎస్ఐలు శంకర్, రంజిత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాలో తారతమ్యాలు సరికాదు

నిజాంపేట్: తాగునీటి సరఫరా విషయంలో అధికారులు తారతమ్యాలు చూపెడుతున్నారని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలకు ఒక విధంగా, పేదలు నివసించే స్లమ్ ఏరియాలకు మరో విధంగా నీటి సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. 33వ డివిజన్ పరిధిలోని మదర్ థెరిస్సా విగ్రహం నుంచి విజయ్ టింబర్ విల్లా వరకు ప్రతిసారి ఐదు గంటల పాటు నీటి సరఫరా జరుగుతోందని, మిగతా ప్రాంతాల్లో గంట పాటు కూడా నీటిని వదలడం లేదన్నారు. గోదావరి జలాల పైపులైన్ పనులను



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

త్వరితగతిన పూర్తిచేసి పేద ప్రజలు నివసించే ఇంద్రన్న కాలనీ, ఎన్టీఆర్ నగర్, సాయి నగర్, రాజీవ్ గాంధీనగర్, ఇందిరమ్మ గృహాలు, రాజీవ్ గృహకల్ప, నిజాంపేట్ విలేజ్, జర్నలిస్ట్ కాలనీలకు సరిపడా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, రవీందర్ రావు, యాదయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేసిన హైడ్రా అధికారులు





హైడ్రా అధికారులు కూల్చివేసిన ప్రహరీ

కీసర: నాగారం మున్సిపాలిటీలో 40 ఫీట్ల (40 అడుగులు) రహదారిని కబ్జాచేసి నిర్మించిన ప్రహరీగోడను బుధవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్లితే.. నాగారం సర్వే నెంబర్‌లో 145,146 లేఅవుట్ పరిధిలోగల 40 అడుగుల రహదారిని నాగారంకు చెందిన ఓ వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాచేసి సదరు స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టారని రాజ్ సుఖ్‌నగర్, బాలాజీనగర్, హనుమాన్‌నగర్, ఈస్ట్ హనుమాన్, సాయిస్వరూప్‌నగర్ కాలనీ వాసులతోపాటు, స్థానిక కాంగ్రెస్ నేతలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి–ఘట్‌కేసర్ ప్రధాన రహదారిలో కబ్జాకు గురైన 40 అడుగుల రహదారి ప్రాంతానికి చేరుకున్న హైడ్రా అధికారులు గట్టి బందోబస్తు మధ్య జేసీబీ సహాయంతో ప్రహరీని పూర్తిగా కూల్చివేయించారు. అనంతరం అందులోఉన్న రేకులు, బెస్‌మెంట్ తదితర వాటిని కూడా పూర్తిగా తొలగించి 40 అడుగుల రహదారిని క్లియర్ చేశారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పంబాల సరితారమేష్, స్థానిక నేతలు, కాలనీవాసులు 40 అడుగుల రహదారి ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం ఏళ్ల నుంచి ఉన్న రహదారి సమస్యను పరిష్కరించినందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తోపాటు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో పలుమార్లు అధికారులకు, పాలకులకు రోడ్డు సమస్యపై ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదన్నారు.

ఇంకెన్నాళ్లు.. ట్రా'ఫికర్'

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ట్రాఫిక్‌తో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ ఎక్కువగా జామ్ అవుతోంది. విద్యార్థులు, వాహనదారులు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్కో సారి సుమారు గంట వరకు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

– నిజాంపేట్



ప్రగతినగర్ కమాన్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద..

- ట్రాఫిక్ సమస్యతో వాహనదారులకు తిప్పలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- గమ్యస్థానాలకు సమయానికి చేరలేక సతమతం

జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ మీదుగా గండిమైసమ్మ చౌరస్తా, రింగ్‌రోడ్డుకు వెళ్లే వాహనాలు ప్రతి నిత్యం ప్రగతినగర్ మీదుగానే వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నిజాంపేట్ క్రాస్ రోడ్డు నుంచి నిజాంపేట్ మీదుగా బాచుపల్లి నుంచి గండిమైసమ్మ చౌరస్తా, మల్లంపేట్, రింగ్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలు నిజాంపేట్, రాజీవ్ గాంధీనగర్, బాచుపల్లి మీదుగా ప్రతి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలా ఎటు వైపు చూసిన ట్రాఫిక్ సమస్య తీవ్రంగానే ఉంది. ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ పోలీసులు సకాలంలో ప్రతి రోజు ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రగతినగర్‌లో శ్రీ మంకీస్ సెంటర్, ఇన్‌కాయిస్ సర్కిల్, ఎలీస్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చేపట్టడం లేదని వాపోతున్నారు. కేవలం అంబేద్కర్ సర్కిల్ వద్ద మాత్రమే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. నిజాంపేట్‌లో నాగార్జున హోమ్స్, అంబేద్కర్ విగ్రహం వద్ద, మంజీరా వాటర్ ట్యాంక్, గోకరాజు రంగరాజు కాలేజీ రోడ్డు బాచుపల్లి సిగ్నల్ వద్ద ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉంటుంది. పోలీసులు కేవలం గోకరాజు రంగరాజు కాలేజీ రోడ్డు బాచుపల్లి సిగ్నల్ వద్ద మాత్రమే కనిపిస్తారు. మిగతా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పట్టించుకునే వారే లేరు.

ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది



ట్రాఫిక్ సమస్యతో వాహనాలు ప్రతి రోజు ఎక్కువగా జామ్ అవుతున్నాయి. వాహనాలు ట్రాఫిక్ నుంచి బయట పడేందుకు చాలా సమయం పడుతుంది. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలి.అధికారులు సమస్యను గుర్తించి, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి.

– మల్లేశ్, ప్రగతినగర్.

సమయం వృథా అవుతోంది



బాచుపల్లి నుంచి నిజాంపేట్ వెళ్లేందుకు ట్రాఫిక్‌ను దాటుకుని వెళ్లాలంటే చాలా కష్టపడాల్సిన పరిస్థితి ఉంది. నిజాంపేట్ నుంచి బాచుపల్లి సిగ్నల్ దాటాలంటే అరగంటపైనే సమయం పడుతుంది. ఇలా ప్రతి రోజు ఇబ్బంది పడుతూ వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

– మహేందర్, రాజీవ్ గాంధీనగర్



నిజాంపేట్ వాటర్ ట్యాంక్ వద్ద జర్నలిస్ట్ కాలనీ సర్కిల్..

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఉద్యోగ అవకాశాల్లో భాగంగా స్టెనో/టైపిస్ట్ (01), రికార్డు అసిస్టెంట్ (01) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- స్టెనో/టైపిస్ట్ పోస్టుకు డిగ్రీ అర్హతతో పాటు షార్ట్ హ్యాండ్ (హయ్యర్) నిమిషానికి 120 పదాల స్పీడ్ ఉండాలని, ఇంగ్లీష్ (హయ్యర్)నిమిషానికి 45 పదాల టైప్ వచ్చి ఉండాలన్నారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటల లోగా రిజిస్టర్ పోస్ట్/స్పీడ్ పోస్ట్ ద్వారా చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, మేడ్చల్–మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ కోర్ట్ కాంప్లెక్స్ అడ్రస్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు రాష్ట్ర కార్యవర్గం అత్యవసర భేటీ

సాక్షి,సిటీబ్యూరో: టీయూటీఎఫ్ రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశం శుక్రవారం పీర్జాదిగూడ (ఉప్పల్ డిపో వెనుక)లో విజయరత్న హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్నట్లు సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కై లాసం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లా శాఖలు, కార్యవర్గ సభ్యులు హాజరై, భవిష్యత్ కార్యక్రమం నిర్వహణ కోసం తీర్మానాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పనిచేస్తున్నామని నిజాంపేట్ 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పంచతత్వ ఆసుపత్రి నుంచి సాయి పార్క్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, కేఎస్ఆర్ హోమ్స్‌పార్క్ వ్యూ అపార్ట్‌మెంట్స్ వరకు రూ.8 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీ వవస్థలను ఆధునీకరించామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సురేంద్ర కుమార్‌యాదవ్, ఆంజనేయవర్మ, మధుకర్‌రెడ్డి, ధర్మేందర్, శశిధర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చిట్ల దివాకర్

అనాథాశ్రమంలో నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: ప్రపంచ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పేట్‌బషీరాబాద్ సెయింట్ ఆన్స్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. బుధవారం మేడ్చల్ పరిధి అత్వెల్లి గ్రామంలోని దైవాలయ అనాథాశ్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు, అల్వాల్‌లోని ఆయుషా అనాథాశ్రమంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిస్టర్ శౌరమ్మ మాట్లాడుతూ.. తమ పాఠశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడేలా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిస్టర్ ఆరోగ్య, ఎన్‌సీసీ సీటీఓ అశ్విన్ ఫెలిక్స్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

కేపీహెచ్‌బీకాలనీ: ఆటోలో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా గమ్యం చేర్చడంతో పాటు సమాజం పట్ల సామాజిక స్పృహతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఆటో డ్రైవర్‌పై ఉందని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట ఆటో స్టాండ్, జేఎన్‌టీయూ ఆటో స్టాండ్‌ల వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిపై జరిగిన అఘాయిత్యాలను గుర్తు చేస్తూ అలాంటి పరిస్థితులు తిరిగి మరోమారు ఉత్పన్నం కాకుండా ప్రతీ ఆటో డ్రైవర్ కృషి చేయాలన్నారు. ఆటో స్టాండ్‌కు వచ్చే ప్రతి ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్, యజమాని పేరు, డ్రైవర్ పేరు, గుర్తింపు కార్డులను సరిచూసుకోవాలన్నారు. ప్రతి ఆటోకు సీరియల్ నెంబర్ కేటాయించి, దానిని కూడా అందరికీ కనిపించేలా ఆటోపై అతికించాలన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన అనుమానాస్పద ఆటోలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆటో ప్రమాదాల నివారణపై, సమాజంలో చోటు చేసుకుంటున్న సంఘటనలపై అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలన్నారు.



గాజులరామారం రావినారాయణరెడ్డి నగర్ ఈస్ట్‌కు చెందిన శ్రీదుర్గాభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్స్‌లో జరిగిన కోటి దీపోత్సవంలో కోలాటం ఆడారు. కార్యక్రమంలో సంధ్య, అరుణ, రాజ్యలక్ష్మి, శ్రావణి, శిరీష, రజిని, ప్రత్యూష, విజయలక్ష్మి, పూజిత, ప్రవళిక బృందం సభ్యులు కోలాటంతో భక్తులను ఆకట్టుకున్నారు. కోలాట కార్యక్రమం గణేష్ మాస్టర్ పర్యవేక్షణలో జరిగింది. – సుభాష్‌నగర్

సర్వే సమయాన్ని.. కుటుంబ సభ్యులకు ముందే చెప్పాలి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

సాక్షి,సిటీబ్యూరో: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే సమయాన్ని ముందుగానే కుటుంబాలకు తెలిపి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునేలా సంబంధిత సర్వే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ సూచించారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ వీసీహాల్‌లో కుటుంబ సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్యుమరేటర్లు డాక్యుమెంట్లు చూసి తప్పులు జరుగకుండా ఫారాలను పూరించాలని, ఏదైన సందేహాలు ఉంటే సూపర్ వైజర్, నోడల్ అధికారి దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ రూపొందించుకుని సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయించాలన్నారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి సమాధానాలు తెలుసుకుంటూ, ప్రత్యక్షంగా పరిశీలించిన అంశాలను ప్రొఫార్మాలో పూరించాలన్నారు. సర్వే నిర్వహణలో కలిగే ఇబ్బందులపై నోడల్ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. దీనికి ముందు జిల్లా నోడల్ అధికారులతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమాచారాన్ని ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్‌కు జిల్లా కలెక్టర్ గౌతమ్ వివరించారు. జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు ఉన్నందున సర్వే పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం అవసరమవుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓలు సైదులు, శ్యాం ప్రకాష్, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖాధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరా డీఎం సుగుణబాయి, జిల్లా యువజన శాఖాధికారి గోపాల్ రావు, జిల్లా మత్స్య శాఖాధికారి సుకీర్తి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోసిస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా క్యాంటీన్‌ను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ పరిశీలించారు. క్యాంటీన్‌లో ఉన్న ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్‌తో సహా వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాయిబాబా నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయిబాబానగర్, ఎంఎన్ రెడ్డి నగర్ ఫేజ్ 1, న్యూ మాణిక్య నగర్, పద్మానగర్ ఫేజ్ 2, వాజ్‌పేయినగర్, నాగులకుంట ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సుభాష్‌నగర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో గురువారం గాజులరామారం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు. 11కేవీ హెచ్ఏఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉషోదయ కాలనీ ఫేజ్–1, 2, ఇందిరా నగర్, సీఎంఆర్ స్కూల్ వెనుక గల్లీ, పీపీ నగర్, ఆర్ఎం నగర్, మార్కెండేయ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

నేడు చిల్డ్రన్స్‌డే ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

చింతల్: చిల్డ్రన్స్ డే సందర్భంగా నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం చిల్డ్రన్స్‌డే ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు గెజిటెడ్ హెచ్ఎం, ఎంఈఓ జెమిని ఎస్ఎస్ కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డీఈఓ విజయ కుమారి ముఖ్య అతిథి గా హాజరుకానున్నట్లు తెలిపారు.

రేపు కార్తీక పౌర్ణమి పూజలు

జగద్గిరిగుట్ట: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం జీడిమెట్ల డిపో సమీపంలోని నల్లగుట్ట లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆలయంలో సత్యనారాయణ వ్రతం, అభిషేకం, అర్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. సత్యనారాయణవ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ముందే పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రాజలింగం మరణం తీరని లోటు

జగద్గిరిగుట్ట: శ్రీనివాస్ నగర్ బస్తీ వ్యవస్థాపకులు డి రాజలింగం మరణం తీరని లోటు అని కాంగ్రెస్ నాయకులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. రాజలింగం గౌడ్ (75) గుండెపోటుతో బుధవారం మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ నగర్‌లో కల్లు గీత సహకార సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కల్లు గీత సహకార సంఘం డైరెక్టర్లు విఠల్ గౌడ్, అంజన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, డి సాయిగౌడ్, మహేష్ గౌడ్, సుభాష్ నగర్ టీసీఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

జగద్గిరిగుట్ట: భూకబ్జాలపై వార్తలు ప్రచురిస్తే బెదిరింపులకు పాల్పడుతున్న భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర యాకన్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జగద్గిరిగుట్ట సీఐ నరసింహకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, దప్పు రామస్వామి, జోగు వెంకట్, వల్లూరి బాబు పాల్గొన్నారు.

బచ్‌పన్ స్కూల్‌లో బాలల దినోత్సవం



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వర నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో బుధవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల చైర్మన్ టీవీఆర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఫ్యాన్సీ దుస్తుల పోటీలు నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పూలు, కార్టూన్లు, ఆహార పదార్థాలకు సంబంధించిన దుస్తులతో పాటు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన సంప్రదాయ దుస్తులు ధరించి చిన్నారులు ఆకట్టుకున్నారు.

మర్యాద ఇవ్వడం లేదని... విద్యార్థినిపై చేయి చేసుకున్న విద్యార్థి

దుండిగల్: తనకు మర్యాద ఇవ్వడం లేదనే అక్కసుతో విద్యార్థినిపై తోటి విద్యార్థి చేయి చేసుకున్నాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన దినేష్ పాల్వంచ(27) బహదూర్‌పల్లిలోని టెక్ మహేంద్ర యూనివర్సిటీలో బీబీఏ జర్నలిజం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తోటి విద్యార్థిని తనకు మొదటి నుంచి మర్యాద ఇవ్వడం లేదని ఆగ్రహించాడు. దినేష్ కళాశాలలో ఆమెపై చేయి చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యంత్రంలో పడి కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు యంత్రంలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం హాబీపూర్‌కు చెందిన శివశంకర్ పాశ్వాన్(33) జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గోవర్ధన్ అట్టల తయారీ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం అట్టలు కత్తిరించే మిషన్‌ను ఆపరేట్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుని మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నాగరాజ్(ఫైల్)

నిజాంపేట్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, తూముకుంట మండలం, విపన్‌గండ్ల గ్రామానికి చెందిన నాగరాజు 15 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి నిజాంపేట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రెండు వారాల క్రితం నాగరాజు కావ్యా లేఅవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేరాడు. ఈ నెల 4న అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సంగీ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.